సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



గేమ్ ఓవర్!

ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లను నిషేధిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తమవుతోంది. వివరాలు 8లో ▸



కాలుష్యం కాటేసింది..!

కలుషిత నీటితో చేపలు మృత్యువాత పడ్డాయి. తొగుట మండలం వర్దరాజుపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు 8లో ▸



.. ప్రయాణం ఎలా?

జహీరాబాద్ బైపాస్ రోడ్డు నుంచి అల్గోల్, భరత్‌నగర్ వైపు వెళ్లే రోడ్డు నిర్మాణంలో జాప్యంతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేడు మంత్రి పర్యటన

మునిపల్లి(అందోల్): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సుమారు రూ.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. కాగా, మంత్రి పర్యటనకు సంబంధించి సంబంధిత అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

24న జిన్నారం కోర్టు ప్రారంభోత్సవం



పనులను పరిశీలిస్తున్న శ్రీధర్ రెడ్డి, రవీందర్

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలో నూతనంగా ఏర్పాటుచేసిన కోర్టు భవనాన్ని ఈనెల 24న ప్రారంభించనున్నారు. మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్‌తో కలసి నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి గురువారం కోర్టు భవనాన్ని పరిశీలించారు. కోర్టు ఆవరణలోని చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ...గతంలో కోర్టు పనులకు సంగారెడ్డి వరకు వెళ్లాల్సిఉండేదన్నారు. ప్రస్తుతం జిన్నారం సర్కిల్ పరిధిలోని గుమ్మడిదల, జిన్నారం, హత్నూర, బొల్లారం ప్రాంతాల ప్రజలకు దూరాభారాన్ని తగ్గించేలా న్యాయసేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నరేందర్‌గౌడ్, శ్రీకాంత్ గౌడ్, కార్యదర్శి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నారాయణఖేడ్: ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు అశోక్, కాశీనాథ్ జాదవ్, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బాబురావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో టీచర్ల సమస్యల పరిష్కారానికి ఈనెల 23న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో నిర్వహించనున్న భారీ ధర్నాకు సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను గురువారం ఖేడ్‌లో ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయాసంఘాల డివిజన్ నాయకులు గోవింద్, విఠల్, సాయిలు, నరేశ్, హరిసింగ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి



దార పరిశ్రమలో సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి టౌన్: కార్మికులకు పరిశ్రమలలో చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సంగారెడ్డి మండలంలోని దార పరిశ్రమను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దార పరిశ్రమలో కార్మికులకు యాజమాన్యం సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. బాల కార్మికులతో పనిచేయిస్తుందని మండిపడ్డారు. అధికారులు వెంటనే స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వయోజనులకు విద్య నేర్పాలి

వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): వయోజనులకు చదువు నేర్పించాలని ఉమ్మడి మెదక్ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్‌రెడ్డి సూచించారు. కల్హేర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో నవభారత్ సాక్షరతా కార్యక్రమం 'ఉల్లాస్'పై గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నిరక్షరాస్యులైన మహిళల కోసం ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఉల్లాస్ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లాలో 55,371 మంది, మెదక్ జిల్లాలో 33,750 మంది, సిద్దిపేట జిల్లాలో 41,153 మంది మహిళలను గుర్తించినట్లు తెలిపారు.

పట్టు సాధించే దీక్ష

- 1.12 లక్షలమందికి ప్రయోజనం
- అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు
- జిల్లాలో 1,248 ప్రభుత్వ పాఠశాలలు

విద్యార్థుల కోసం దీక్ష యాప్ రూపొందించిన విద్యాశాఖ

అనివార్యకారణాలు, అనారోగ్య, ఇతరత్రా సమస్యలతో పాఠశాలకు వెళ్లలేని విద్యార్థులు ఆ రోజు బోధించే పాఠాలకు దూరం కావాల్సి వస్తోంది. ఆ పాఠాలను మళ్లీ వినడానికి అవకాశముండదు. దీన్ని గమనించిన విద్యాశాఖ అధికారులు అలాంటి విద్యార్థుల కోసం ప్రత్యామ్నాయంగా దీక్ష యాప్‌ను తయారు చేశారు. ఈ యాప్‌లో విద్యార్థులు లాగిన్ అయి అవసరమైన పాఠాలను వీడియోల రూపంలో వినే సౌకర్యాన్ని కల్పించారు. పాఠ్యపుస్తకాల్లో ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు..విద్యార్థులు తమకు అవసరమైన పాఠాలను వినవచ్చు.



పాఠాలు వింటున్న విద్యార్థులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పాఠశాలకు వెళ్లకుండా పాఠ్యాంశాలలో వెనుకబడిన విద్యార్థులు ఆయా పాఠాల్లో పట్టు సాధించడానికి రాష్ట్ర విద్యాశాఖ దీక్ష యాప్‌ను ఇంటర్నెట్‌లో పొందుపరిచింది. పాఠశాలకు వెళ్లలేక ఉపాధ్యాయులు చేప్పే పాఠాలు వినలేని విద్యార్థుల బాధలు అన్నీఇన్నీ కావు. అయితే ఇక మీదట ఇలాంటి బాధలు పడాల్సిన పనిలేదు. తమకు కావాల్సిన సబ్జెక్టులోని పాఠాలను ఎప్పుడంటే అప్పుడు నిపుణులైన ఉపాధ్యాయులు చెప్పే వీడియో క్లాస్‌లను దీక్ష యాప్ ద్వారా వినవచ్చు.

పాఠ్యపుస్తకాల్లో క్యూఆర్ కోడ్

ఒకటి నుంచి పదవతరగతి వరకు పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అకాడమీ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసింది. ఆ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలన్నీ యాప్‌లో పొందుపరిచింది. పలు భాషల్లో ఈ పాఠ్యాంశాలు వినే విధంగా దీన్ని రూపొందించారు. పాఠ్యపుస్తకాల్లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి తమకు కావాల్సిన పాఠాలను ఈ దీక్ష యాప్ ద్వారా ఎన్నిసార్లైనా వినవచ్చు. విద్యార్థుల మానసికస్థాయికి తగినట్లు దృశ్యరూపకంగా బోధన సాగుతుంది. ఒక్క క్లిక్‌తో పాఠ్యాంశాలను విని ఆయా సబ్జెక్టుల్లో పూర్తిస్థాయిలో పట్టు సాధించవచ్చు. స్మార్ట్‌ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అర్థం కాని పాఠ్యాంశాన్ని చదివే వెసులుబాటు కల్పించింది. ఏమైనా సందేహాలున్నా యాప్ ద్వారా నివృతి చేసుకోవచ్చు. టీచర్ చెప్పిన పాఠం సరిగ్గా అర్థం కాకున్నా ఇంటికి వెళ్లి దీక్ష యాప్ ద్వారా ఆ పాఠ్యాంశాన్ని ఒకటికి రెండుసార్లు విని పూర్తిగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు ఉభయతారకంగా పనిచేసే విధంగా రూపొందించారు. ఇందులోని పాఠ్యాంశాలన్నీ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించారు.

డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా..

స్మార్ట్‌ఫోన్‌లోని ప్లేస్టోర్ లేదా ఐఓఎస్‌లోకి వెళ్లి 'దీక్ష'ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లోకి వెళ్లి లాంగ్వేజ్‌తోపాటు ఇతర అడిగిన వివరాలన్నీ నమోదు చేయాలి. ఆ తర్వాత లాగిన్ అవ్వాలి. ఈ యాప్‌ను ఉపయోగించి టెక్స్టుబుక్స్‌పై స్కాన్ చేస్తే డిజిటల్‌పాఠం వస్తుంది. పాఠ్యపుస్తకం ప్రధాన పుటపై ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్‌చేస్తే స్మార్ట్‌ఫోన్‌లో కోరుకున్న పాఠ్యాంశాన్ని పొందవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులు దీక్ష యాప్‌ను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలి. అనివార్యకారణాలతో పాఠశాలకు వెళ్లలేని విద్యార్థులకు ఈ యాప్ ఎంతో ప్రయోజనకరం. క్లాస్‌లో టీచర్ బోధించిన సబ్జెక్టును తిరిగి స్మార్ట్‌ఫోన్‌లో ఈ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది.

-వెంకటేశ్వర్లు, డీఈవో సంగారెడ్డి

'సైబర్' సొత్తు రికవరీలో నం.1

మల్టీజోన్‌లోనే మొదటి స్థానంలో సంగారెడ్డి

- 6 నెలల్లో రూ.1.42 కోట్లు బాధితుల ఖాతాల్లో జమ
- గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం.. వినియోగాన్నీ కట్టడి చేశాం
- సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 570 సెల్‌ఫోన్లు రికవరీ
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎస్పీ పరితోశ్ పంకజ్



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: బాధితుల ఖాతాల నుంచి సైబర్ మోసగాళ్లు తస్కరించిన సొమ్మును రికవరీ చేయడంలో సంగారెడ్డి జిల్లా పోలీసుశాఖ మల్టీజోన్‌లోనే మొదటి స్థానంలో ఉందని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ పేర్కొన్నారు. ఈ ఆరు నెలల్లోనే సుమారు రూ.1.42 కోట్లను రికవరీ చేసి బాధితుల ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. సైబర్ మోసాల బారిన పడుతున్న బాధితుల్లో ఎక్కువమంది ఉన్నతవర్గానికి చెందిన ప్రొఫెసర్లు, ఐటీ నిపుణులు, వైద్యులు వంటి ఉంటున్నారన్నారు. పెట్టుబడులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టులతో సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథాను ఎంచుకుంటున్నారని చెప్పారు. అత్యాశకు పోయి బాధితులు తమ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయించుకుంటున్నారన్నారు. సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల అక్రమరవాణా వంటి వ్యవస్థీకృత నేరాలపై పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను ఎస్పీ పరితోశ్ పంకజ్ 'సాక్షి'కి గురువారం వెల్లడించారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి.?

➡ ఎస్–నాబ్ విభాగం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ ఆరునెలల్లోనే సుమారు రూ.కోటి విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకుని, 19 కేసులు నమోదు చేశాం. మరోవైపు గంజాయి వినియోగాన్నీ కట్టిడి చేశాం. ఎప్పటికప్పుడు గంజాయి దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. కల్తీకల్లు తయారీకి వినియోగించే అల్ప్రాజోలమ్ తయారీ కేంద్రం గుట్టు రట్టు చేశాం. రూ1.52 కోట్లు విలువ చేసే పల్లాడియంను స్వాధీనం చేసుకున్నాం.

సిగాచి పేలుడు కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చింది?

➡ సిగాచి ప్రమాదం చాలా బాధాకరం. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. పటాన్‌చెరు డీఎస్పీ దర్యాప్తు అధికారిగా ఉన్నారు. ఈ కేసులో సాంకేతిక ఆధారాలు చాలా కీలకం. వివిధ శాఖల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా ఈ కేసులో ముందుకెళ్తున్నాం.

సెల్‌ఫోన్ చోరీల రికవరీ ఏమేరకు జరుగుతోంది..?

➡ సెల్‌ఫోన్‌ల రికవరీపై ఐటీ విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఈ ఆరు నెలల్లో 570 సెల్‌ఫోన్లను రికవరీ చేశాం. వీటి విలువ సుమారు రూ.60 లక్షల వరకు ఉంటుంది. బాధితులు నేరుగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి?

➡ సంగారెడ్డిలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. అవసరమైన చోట్ల మరమ్మతులు చేశాం. పటాన్‌చెరు వంటి చోట్ల కూడా ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నాం.



శాంతిభద్రతల పరిరక్షణలో తీసుకుంటున్న చర్యల గురించి..

➡ నేరాల నియంత్రణపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి ఉంటుంది. ఎక్కడైనా ఘర్షణలు జరిగే అవకాశాలుంటే తక్షణం క్షేత్రస్థాయిలో పోలీసులు స్పందించేలా చర్యలు తీసుకుంటున్నాం. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిషేధం, పోక్సో చట్టం, మహిళలకు రక్షణ వంటి అంశాలపై ఈ ఆరు నెలల్లో సుమారు 300లకు పైగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం.

మట్టి విగ్రహాలను వినియోగించండి

కలెక్టర్ ప్రావీణ్య



మట్టి వినాయక ప్రతిమను అందిస్తున్న సభ్యులు

సంగారెడ్డి జోన్: వినాయక చవితి పండుగను అందరూ పర్యావరణహితంగా జరుపుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. మట్టి వినాయక విగ్రహాలని ప్రతిష్ఠించి, పూజలు చేసుకోవాలని ఆమె సూచించారు. కలెక్టరేట్‌లో హెల్పింగ్ హ్యాండ్ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్ ప్రావీణ్యను గురువారం కలిసి మట్టి గణేశుడి విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అఖిల్, నాగేష్ ఉన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

పటాన్‌చెరు టౌన్: కార్మికుల కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాణిక్ డిమాండ్ చేశారు. పాశమైలారం పారిశ్రామికవాడలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం నిర్వహించిన సర్వేలో ఆయన పాల్గొని కార్మికులనుద్దేశించి మాట్లాడారు. వందలాది పరిశ్రమల్లో 1.80 లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజు, సుధాకర్, వెంకటేశ్, రోషన్ పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సర్వే చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పెంపు

డీఈఓ వెంకటేశ్వర్లు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ విధానంలో 2025–26వ సంవత్సరానికి గానూ పదవ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులలో ప్రవేశం పొందేందుకు ఈ నెల 31 వరకు విద్యాశాఖ గడువు పొడిగించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పదవ తరగతికి సంబంధించి ఓసీ విద్యార్థులకు రూ.1,400, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులతో పాటు విద్యార్థినులకు రూ.1000, ఓటీఆర్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150, నిర్ణీత అపరాధ రుసుం రూ.100 ఆన్‌లైన్ చార్జీలు అదనంగా ఉంటాయన్నారు. అదేవిధంగా ఇంటర్‌కు సంబంధించి ఓసీ విద్యార్థులకు రూ. 1,500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థినీ విద్యార్థులకు రూ.1,200, ఓటీఆర్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300, నిర్ణీత అపరాధ రుసుం రూ.200తోపాటు ఆన్‌లైన్ చార్జీలు అదనంగా ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యాసకులు అధ్యయన కేంద్రాల్లో ధ్రువపత్రాలను సమర్పించి, అడ్మిషన్ ఫారమ్ పొందాలన్నారు. పూర్తి వివరా లకు ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635ను సంప్రదించాలని చెప్పారు.

సదాశివపేట మున్సిపల్ కమిషనర్‌గా శివాజీ

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట మున్సిపల్ కమిషనర్‌గా టి.శివాజీ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నూతన కమిషనర్ శివాజీకి మున్సిపల్ సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఇంతవరకు ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఉమ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్‌కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని నూతన కమిషనర్ శివాజీ తెలిపారు.



బాధ్యతలు చేపడుతున్న శివాజీ


హ్యావాట్సప్..

రైతులకు వాట్సప్ చానల్

- వారం క్రితం ప్రారంభించిన వ్యవసాయశాఖ
- పంటల సంరక్షణ, సబ్సిడీలు తెలుసుకునే అవకాశం



యెట్టిగడ్డసంఘం శివారులో రైతులు సాగు చేస్తున్న వరి



ప్రభుత్వం రూపొందించిన వాట్సప్ ఛానల్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వాట్సప్ ద్వారా వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు సమాచారాన్ని రైతులకు చేరవేయాలని నిర్ణయించింది. పంటల సంరక్షణ, సలహాలు, సూచనలతోపాటుగా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను, వాతావరణ శాఖ సూచనలను రైతులకు ఈ ఛానల్ ద్వారా ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అందజేస్తోంది. సాగులో ఏర్పడే సమస్యలకు రైతులు అధికారుల వద్దకు వెళ్లాల్సివచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేకుండానే అవసరమైన సమాచారాన్ని అరచేతికే అందజేస్తోంది వ్యవసాయశాఖ. వారం క్రితం ప్రారంభించిన వాట్సప్ ఛానల్ ద్వారా వరి, పత్తి, మొక్కజొన్నతో పాటుగా ఇతర పంటల సాగు మెళకువలతోపాటు భారీ వర్షాలతో పంటల్లో చేపట్టాల్సిన చర్యలు, పంటలను కాపాడుకునేందుకు తీసుకునే జాగ్రత్తల గురించి సూచనలు, సలహాలినిస్తోంది.

అరచేతిలో సమాచారం...

రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం వారం క్రితం వాట్సప్ ఛానల్‌ను అందుబాటులోకి తెచ్చింది. మొబైల్ కలిగిన ప్రతీ రైతు ఈ ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు. ఛానల్‌పై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. విత్తన దశ నుంచి పంట కోసే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మార్కెట్‌కు సంబంధించిన ధరలను విత్తనాల వివరాలను తెలుసుకోవచ్చు.

రైతులందరూ వినియోగించుకోవాలి

ప్రభుత్వం తీసుకొచ్చిన అధికారిక వాట్సప్ ఛానల్‌ను రైతులందరూ వినియోగించుకోవాలి. అదేవిధంగా రైతులు వ్యవసాయ శాఖ వాట్సప్ ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి. ఈ ఛానల్ ద్వారా రైతులకు శాస్త్రవేత్తల సూచనలు,సలహాలు అందుతాయి.

-శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

గాడితప్పిన గురుకులం

- ప్రిన్సిపాల్ తొలగింపుపై ఎమ్మెల్యే ఆదేశించినా చర్యలు శూన్యం
- ప్రశ్నించే విద్యార్థులకు తప్పని వేధింపులు

నారాయణఖేడ్: ఆ గురుకులం గాడితప్పింది. విద్యాభ్యాసానికి వచ్చిన విద్యార్థులతో పనులు చేయిస్తున్నారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం విద్యార్థులు అపరిశుభ్ర పరిసరాలతో సహవాసం చేస్తూ చదువు కొనసాగిస్తున్నారు. ఇటీవలే గురుకులం మొత్తం గజ్జి, తామర అంటు వ్యాధులతో తల్లడిల్లుతున్న విషయం పత్రికల్లో వచ్చాక ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి చర్యలు తీసుకోవాలని సూచించినా సదరు ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. విద్యార్థుల అనారోగ్యాలకు, అక్రమాలకు కారకుడైన ప్రిన్సిపాల్‌కు గురుకుల అధికారులు వత్తాసు పలుకుతుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇటీవలే తనిఖీ

ఖేడ్‌లో కొనసాగుతున్న బీసీ గురుకులంలో అంటు వ్యాధులు ప్రబలడం, తీవ్ర దుర్గంధభరిత పరిసరాలు, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడం వంటి అంశాలు పత్రికల్లో రావడంతో రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సబ్‌కలెక్టర్ ఉమాహారతి, ఆర్‌సీవో గౌతంరెడ్డి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడగా సమస్యలను వారి ముందు ఏకరవు పెట్టారు. తాము అనారోగ్యాలకు గురైనా చికిత్సలు అందిచడంలేదని, సమస్యలు చెబితే ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని, అధ్వానమైన భోజనంతో తినలేకపోతున్నామని, ప్రిన్సిపాల్‌ను అతనికి వత్తాసు పలుకుతున్న మరో ఉద్యోగిని తొలగించాలని విద్యార్థులు ఎమ్మెల్యేతో వేడుకున్నారు. దీంతో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించిన సంగతి తెలిసిందే.



ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేయడంతో తలదించుకుంటున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఆ అధికారితో కుమ్మక్కు!

ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను వెంటనే విధుల్లోంచి తొలగించి జేఎల్‌గా ఉన్న మాజీ వైస్ ప్రిన్సిపాల్ ప్రతిభకు బాధ్యతలు అప్పగించాలని ఎమ్మెల్యే ఆదేశించినప్పటికీ ఇంకా ఆయన ప్రిన్సిపాల్ కుర్చీలోనే వేలాడుతుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. చర్యలు తీసుకోవాల్సిన ఆర్సీవో ఘటన రోజు రాత్రి వరకు ఉండి ప్రిన్సిపాల్‌తో కుమ్మక్కై చర్యలకు తీసుకోవడం లేదనే ఆరోపణలు తల్లిదండ్రుల నుంచి వస్తున్నాయి. ఇక పెద్దశంకరంపేట పీహెచ్‌సీ వైద్యులు డా.శర్ఫోద్దీన్ ప్రిన్సిపాల్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం లేదని, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని విజిటర్ బుక్‌లో నమోదు చేసినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు.

విద్యార్థులపై వేధింపులు

విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు సమస్యలపై ప్రిన్సిపాల్‌ను నిలదీస్తే వారి పిల్లలను లక్ష్యంగా చేసుకుని ఇతర విద్యార్థులతో వేధింపులకు పాల్పడిన ఘటనలు కూడా గురుకులంలో చోటుచేసుకున్నట్లు చిన్నారులు చెబుతున్నారు. ఈ విషయం ప్రిన్సిపాల్‌కు తెలిపితే సదరు బాధిత విద్యార్థినే తప్పుగా చూపుతూ వారిని, వారి తల్లిదండ్రులను మందలిస్తున్నారు. దీంతో గురుకులంలో ఉండేందుకు విద్యార్థులు ఇష్టపడటంలేదు. సమస్యలు చెప్పేందుకు తల్లిదండ్రులు సాహసించడంలేదు. కొందరు విద్యార్థులు టీసీలు తీసుకొని వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.



గురుకులంలో పనులు చేస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

హిందీ టీచర్‌కు డాక్టరేట్

రామాయంపేట(మెదక్): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు దొర్బల వేదశ్రీకి డాక్టరేట్ లభించింది. హిందీ సాహిత్యంలో 'సామాజిక ధ్యాన్' కావ్యం రూపొందించినందుకు గాను ఆమెకు ఈ అవార్డు వరించింది. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో హిందీ టీచర్‌ను తోటి ఉపాధ్యాయులు సన్మానించారు.

మత్తు పదార్థాలపై కొరడా

- జాగిలాలతో తనిఖీలు



చిన్నశంకరంపేటలోని దాబాలో తనిఖీ చేస్తున్న డాగ్‌స్కాడ్ బృందం

చిన్నశంకరంపేట(మెదక్): గంజాయి, డ్రగ్స్ వంటి నిషేధిత మత్తు పదార్థాలపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. ఈ మేరకు చిన్నశంకరంపేట, నార్సింగి మండల కేంద్రాల్లోని హోటళ్ల వద్ద పోలీస్‌లు డాగ్‌స్కాడ్ బృందంతో తనిఖీలు నిర్వహించారు. దాబాలతో పాటు హోటళ్లు, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలతో పాటు మద్యంను గుర్తించేందుకు జాగిలాలతో తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో భాగంగానే మిర్జాపల్లి రైల్వేస్టేషన్, నార్సింగి బస్టాండ్‌లలో డాగ్‌స్కాడ్ బృందం తనిఖీలు చేపట్టింది. తనిఖీల్లో చిన్నశంకరంపేట, నార్సింగి ఎస్‌ఐలు నారాయణగౌడ్, సృజర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని లింగంపల్లి చౌరస్తా వద్ద తీవ్రగాయాలైన ఓ గుర్తు తెలియని వ్యక్తిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. లింగంపల్లి చౌరస్తాలో నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఈనెల 13న తీవ్ర గాయాలతో ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడు. గమనించిన పోలీసులు వెంటనే 108 అంబులెన్స్‌లో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు టీషర్ట్, ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతిడి వయస్సు 35నుంచి 40ఏళ్లు ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి ఎవరైన గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో..

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇంద్రేశం నుంచి పోచారం వెళ్లే దారిలో ఈనెల 17 వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుంటలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బంధం కొమ్ము గ్రీన్ విల్లాస్ సమీపంలోని కొచ్చెరువు కుంటలో గురువారం గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్లు ఉండవచ్చని, మృతిచెంది మూడు రోజులు కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు. అయితే పూర్తిగా గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొలం పనులకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

సిద్దిపేటఅర్బన్: వరి పొలంలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఎన్సాన్‌పల్లిలో గురువారం చోటుచేసుకుంది. పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన తంగళ్లపల్లి నర్సింహాచారి (50) వృత్తి రీత్యా బంగారు నగల పనిచేస్తుంటాడు. గత కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న ఆయన ఈ నెల 19న ఉదయం పని నిమిత్తం వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులోని ఓ వరి పొలంలో మృత దేహం ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా ప్యాంట్ జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా నర్సింహాచారిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు దినేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



గేమ్ ఓవర్!

ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లపై ఉక్కుపాదం

- ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు ఆమోదం తెలిపిన ఉభయసభలు
- జిల్లాలో యాప్‌లకు బానిసై సూసైడ్ చేసుకున్న యువత
- కేంద్ర నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు

సాక్షి, సిద్దిపేట: ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ది ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్-2025 పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా లోక్‌సభతో పాటు రాజ్యసభల్లోనూ ఆమోదం పొందింది. ఈ మేరకు ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లను నిషేధిస్తూ కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గేమింగ్, బెట్టింగ్‌లకు చాలా మంది యువత బానిసై ఆర్థికంగా నష్టపోయి ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. అలాగే మరికొంతమంది అప్పుల పాలై పోలీసులను సైతం ఆశ్రయించారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఈ యాప్‌లు నిషేధంలో ఉన్నప్పటికీ దొంగచాటున ప్రవేశించి యువతను బానిసలుగా మార్చాయి. తాజాగా, ఉభయ సభల్లో ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లను నిషేధిస్తూ నిర్ణయం తీసుకోవడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతిస్తున్నారు.

మంచి నిర్ణయం



ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లతో యువత బానిసై అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల రామునిపట్లలో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆన్‌లైన్ బెట్టింగ్‌తో రూ.లక్షల్లో నష్టపోయాడు. దీంతో అప్పులు తీర్చలేక కుటుంబ సభ్యులందరూ ఆత్మహత్య చేసుకున్నారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌ల నిషేధంపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిది.

– సింగిరెడ్డి, లక్ష్మారెడ్డి, రిటైర్డ్ ఎంపీడీఓ

కేంద్ర నిర్ణయం హర్షణీయం



ఆన్‌లైన్ గేమింగ్ సంబంధించిన అన్ని యాప్‌లను బ్యాన్ చేయడం హర్షణీయం. ఈ యాప్‌లతో ఎంతోమంది యువత డబ్బులు పోగొట్టుకున్నారు. మరికొంతమంది ఆత్మహత్యలు చేసుకుని తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చారు. ఆన్‌లైన్ యాప్‌లను పూర్తి స్థాయిలో అరికట్టాలి.

– రాము, వ్యాపారస్తుడు, జగదేవపూర్

మంచి పరిణామం



కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం విధించడం చాలా మంచి పరిణామం. ఆన్‌లైన్ గేమింగ్ ఉచ్చులో చిక్కి వందలాది కుటుంబాలు ఆర్థికంగా చిన్నభిన్నమయ్యాయి. యువకులు ఎద్ద ఎత్తున ఆర్థికంగా నష్టపోయారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు.

– రమణారెడ్డి, దుబ్బాక

ఆర్థికంగా చిన్నాభిన్నం..



ఆన్‌లైన్ గేమ్స్‌తో ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. తల్లిదండ్రులకు తెలియకుండానే పిల్లలు గేమ్స్ ఆడి ఆస్తిపాస్తులను కోల్పోతున్నారు. కొంతమంది ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతుంది. ఇటీవల ఎగ్లాస్పూర్, బొమ్మనపల్లిలో ఓ అధికారి, పందిళ్లలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కుటుంబాలు వీధిన పడ్డాయి. ఆన్‌లైన్ గేమ్స్ నిషేధించడం మంచి పరిణామం.

– లక్కిరెడ్డి, తిరుమల, హుస్నాబాద్

కాలక్షేపంతో వ్యసనంగా మారి



యువత కాలక్షేపం కోసం ఆన్‌లైన్ గేమ్‌లు ఆడిన ఈ అలవాటు వ్యసనంగా మారింది. చివరికి అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఉన్నత కుటుంబాల యువత ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ బారిన పడి చిన్నాభిన్నమయ్యారు. ఇలాంటి బిల్లును ప్రభుత్వాలు తీసుకురావడం మంచి పరిణామం. వీటిపై ప్రజలకు అవగాహన అవసరం.

– వరుకోలు రాజలింగం, అడ్వకేట్, సిద్దిపేట

కేంద్రం నిర్ణయం హర్షణీయం



ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లను నిషేధిస్తూ పార్లమెంట్‌లో తీర్మానం చేయడం హర్షణీయం. బెట్టింగ్ యాప్‌ల ద్వారా యువత జీవితం అంధకారంగా మారుతుంది. ఎందరో అమాయకులు బలి అయ్యారు. కేంద్రం ఆలోచించి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

– మమత, మహిళా సంఘ నాయకురాలు, చిన్నకోడూరు

కాలుష్యం కాటేసింది..!

- చెరువుల్లోకి చేరుతున్న కలుషిత నీరు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- మృత్యువాత పడుతున్న చేపలు
- ఉపాధి కోల్పోతున్నామని మత్స్యకారుల ఆవేదన



వరదరాజుపల్లి చెరువులో మృత్యువాత పడిన చేపలు

తొగుట(దుబ్బాక): కలుషిత నీటితో చేపలు మృత్యువాత పడిన సంఘటన మండలంలోని వర్దరాజుపల్లిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో గ్రామస్తులు వ్యతిరేకత వ్యక్తం చేసిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా గ్రామ శివారులోని గుట్టల మధ్యన సిద్దిపేట పట్టణ మున్సిపాలిటీ చెత్తయార్డు ఏర్పాటు చేశారు. అయితే అప్పటి నుంచి చెత్తతో పాటు పట్టణంలోని ఆస్పత్రుల నుంచి డిస్పోజల్స్‌ను సైతం పడేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం నుంచి దుర్వాసనతో పాటు రసాయనాలు, విషవాయువులు వెలువడడంతో పొలాల్లో పనిచేయలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి ఏటా వర్షాకాలంలో భారీ వర్షాలకు కలుషితమైన నీరంతా సమీపంలోని గుట్టకాడి కుంట, దమ్మాయిచెరువు, కాసాయికుంట, పిండే చెరువుల్లోకి చేరుతోంది. దీంతో చెరువుల్లోని నీళ్ల కాలుష్యం చెంది చేపలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. కొంతకాలంగా మృత్యువాత పడుతున్న చేపల సంఖ్య పెరిగిపోవడంతో తాము ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంప్ యార్డును ఇతర ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులతో పాటు మత్స్యకారులు కోరుతున్నారు.

తప్పడు పట్టా..

రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని రైతు ఆత్మహత్యాయత్నం



బాధితుడితో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్‌ఐ

చిన్నకోడూరు(సిద్దిపేట): తమ పట్టా భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని, రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గోనెపల్లికి చెందిన ముష్కిరి యాదయ్యకు సర్వే నంబర్ 310లో వంశపారంపర్యంగా ఉన్న 1.32 గుంటల భూమిలో కొంతకాలంగా సాగు చేసుకుంటున్నారు. అయితే గతేడాది ఎలాంటి విక్రయాలు జరపకుండానే ముష్కిరి రామవ్వ, ముష్కిరి వజ్రవ్వ, ముష్కిరి బాల్‌రాజుల పేరిట పట్టాలోకి మారింది. అయితే, ఈ భూమిని ఇతరులకు విక్రయిస్తున్న విషయం తెలుసుకున్న యాదయ్య కుమారుడు రాజు వెంటనే భూ రిజిస్ట్రేషన్ నిలిపి వేయాలని తహసీల్దార్ సలీమ్‌కు ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత క్షణికావేశంలో తనకు న్యాయం చేయాలని డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా.. స్థానికులు వెంటనే అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్ సలీమ్, ఎస్‌ఐ సైఫ్ అలీ బాధితుడు రాజుతో మాట్లాడి సర్ది చెప్పారు. ఈ విషయంపై కలెక్టర్‌కు నివేదించి బాధితుడికి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

గడువులోగా ఐటీ రిటర్న్స్ దాఖలు చేయండి

ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ సీహెచ్ రమేష్



మాట్లాడుతున్న ఆదాయపు పన్నుశాఖ జాయింట్ కమిషనర్ సీహెచ్ రమేష్

సిద్దిపేటకమాన్: నిర్ణీత గడువులోగా ఐటీ రిటర్న్స్ దాఖలు చేయాలని ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ సీహెచ్ రమేష్ తెలిపారు. పట్టణంలో రైస్ మిల్లర్లు, డాక్టర్లు, పత్తి, వస్త్ర, సిమెంట్, పౌల్ట్రీ, ఇతర వర్తక సంఘాలు, వ్యాపారులతో ఆదాయపు పన్ను శాఖ అధికారులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024-25 ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు, అడ్వాన్స్ టాక్స్, మోసపూరిత రిఫండ్ క్లెయిమ్ చేయడంతో కలిగే పరిణామాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఐటీ రిటర్న్ దాఖలు చేయకపోవడంతో కలిగే పరిణామాలు, ఇతర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆదాయపు పన్ను శాఖ అధికారి రమణరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది ప్రదీప్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇస్నాపూర్ చౌరస్తాలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు సీఐ వినాయక్ రెడ్డి ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామని ఎస్‌ఐ తెలిపారు. ఈ తనిఖీలో మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్టకు చెందిన ఎరుకలి అరుణ్‌ని అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం నిందితుడి నుంచి 100 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎక్కడైనా గంజాయి విక్రయించినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు ఆసిఫ్ అలీ, అభిమాని సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

గోవా మద్యం పట్టివేత

ఇద్దరి అరెస్టు



ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లతో పాటు నిందితులు

జహీరాబాద్ టౌన్: గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను గురువారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర ఆదేశాల మేరకు మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నల్గొండకు చెందిన నవీన్, మురళీలు ట్రావెల్స్ బస్సులో మద్యం తీసుకొస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు వారి నుంచి వివిధ రకాల బ్రాండ్స్‌కు చెందిన 37 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసు కుని ఇద్దరిని అరెస్టు చేశారు. అనంతరం స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్‌ఐ ఉమారాణి, హెచ్‌సీ కిషన్ కాని స్టేబుళ్లు అంజిరెడ్డి, వంశీ, శివ పాల్గొన్నారు.

చోరీ చేసిన ఇంటికే నిప్పు



మంటలకు ఆహుతైన బీరువా, ఇతర వస్తువులు

రామాయంపేట(మెదక్): ఓ ఇంట్లో చోరీ చేసిన అనంతరం దుండగులు నిప్పు పెట్టిన ఘటన మండలంలోని పర్వతాపూర్‌లో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజు కథ నం మేరకు.. గ్రామానికి చెందిన చంద్రపు విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబం హైదరాబాద్‌లో నివాసం ఉంటుండగా.. పర్వతాపూర్‌లో తన ఇంటికి తాళం వేసి వెళ్లారు. అయితే తెల్లవారు జామున గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి విలువైన వస్తువులు దోచుకున్నారు. అనంతరం ఇంటికి నిప్పంటించారు. విషయం తెలుసుకున్న విష్ణువర్ధన్‌రెడ్డి ఉదయం గ్రామానికి వచ్చి చూడగా.. ఇంటిలో కొంతభాగం కాలిపోగా విలువైన వస్తువులు సైతం కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు అనుమానంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ ఫైనాన్స్ పేరిట ఘరానా మోసం

- బైక్ షోరూం యజమాని అరెస్ట్

మెదక్ మున్సిపాలిటీ: నకిలీ ఫైనాన్స్ కేసులో ఓ బైక్ షోరూం యజమానిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆటోనగర్‌లో ఉన్న ఓ బైక్‌షోరూంలో 2022లో హవేళిఘణాపూర్ మండలం కొత్తపల్లికి చెందిన నార్ల సంతోష్ బైక్ కొనుగోలు చేశాడు. అయితే ఈ సమయంలో బైక్ షోరూం యజమాని టాటా ఏఐజీ పేరిట ఇన్సూరెన్స్ చేసి పత్రాలు అందజేశారు. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా లింగంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతోష్ మరణించగా.. అతని కుటుంబ సభ్యులు ఇన్సూరెన్స్ డబ్బుల కోసం టాటా ఏఐజీ కంపెనీని సంప్రదించారు. ఈ మేరకు ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించగా.. నకిలీ ఇన్సూరెన్స్‌గా తేలింది. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో నకిలీ ఇన్సూరెన్స్ తేలిందని, బైక్ షోరూం యజమాని బండ నరేందర్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

తప్పిన ప్రమాదం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజీపేట శివారులో గురువారం రాత్రి కారు, డీసీఎం ఎదురెదురుగా ఢీకొన్నాయి. చిన్నశంకరంపేట నుంచి మెదక్ వెళ్తున్న డీసీఎం, మెదక్ నుంచి చిన్నశంకరంపేట వస్తున్న కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందు బాగం దెబ్బతినడంతో పాటు ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పింది. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

రైతులపై అడవి పంది దాడి

వట్‌పల్లి(అందోల్): వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులపై ఓ అడవి పంది దాడి చేసింది. మండల పరిధిలోని పోతులబోగుడాలో గురువారం భేగరి ప్రదీప్ తన భార్య వసంతతో కలిసి పొలానికి వెళ్లాడు. ఈ సమయంలో ఓ అడవిపంది ప్రదీప్‌పై దాడి చేయగా.. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో రైతు రాజుపై దాడిచేసి పరుగులు తీసింది. ఈ క్రమంలో ఎస్సీ కాలనీలో రోడ్డుపై కూర్చున్న కిష్టయ్యపై దాడి చేసింది. వెంటనే ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు.

కాళ్లు కోల్పోయిన సిద్దిరాములుకు వీల్‌చైర్



సిద్దిరాములకు వీల్‌చైర్‌ను అందిస్తున్న సానిక్ష ఫౌండేషన్ సభ్యులు

స్పందించిన 'సానిక్ష' ఫౌండేషన్

సాక్షి ఎఫెక్ట్

చిన్నశంకరంపేట(మెదక్): రెండు కాళ్లు కోల్పోయి నడవలేని స్థితిలో ఉన్న నార్సింగి మండలం శేరిపల్లికి చెందిన చెప్యాల సిద్దిరాములుకు సానిక్ష ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శివ గురువారం వీల్‌చైర్ అందజేశారు. ఈ మేరకు బుధవారం సాక్షి పత్రికలో 'రెండు కాళ్లు కోల్పోయా ఆదుకోండి' అనే కథనానికి సానిక్ష ఫౌండేషన్ చైర్మన్ స్పందించారు. అనంతరం ఫౌండేషన్ సభ్యుడు శ్రీకాంత్‌తో కలిసి శేరిపల్లికి చేరుకుని సిద్దిరాములకు వీల్‌చైర్‌ను అందించారు. ఈ వీల్‌చైర్‌ను హైదరాబాద్‌కు చెందిన ఇక్షణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మేఘన నందూరి, రాజశేఖర్‌రెడ్డి సహకారంతో అందించినట్లు తెలిపారు.

దర్శనానికి వెళ్లొస్తూ అనంతలోకాలకు..

బచ్చన్నపేట: దైవ దర్శనానికి వెళ్లొస్తూ ఓ వ్యక్తి అనంతలోకాలకు చేరాడు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బండనాగారం సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ అబ్దుల్ హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాములకి చెందిన మలిపెద్ది సత్యనారాయణ (53) గురువారం ఉదయం తన భార్య నాగలక్ష్మితో కలిసి బైక్‌పై కొడవటూరులోని సిద్ధేశ్వరాలయానికి వచ్చి పూజలు నిర్వహించారు. తిరుగు ప్రయాణంలో తన భార్య నాగలక్ష్మిని బంధువుల కారులో ఎక్కించి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన మురుగంటి రంజిత్‌కుమార్ బైక్‌పై బండనాగారం నుంచి బచ్చన్నపేటకు వెళ్తుండగా.. లక్ష్మాపూర్ కమాన్ వద్ద ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను చికిత్స నిమిత్తం సిద్దిపేటకు తరలిచగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గురుకులాల అవినీతిపై చర్యలు తీసుకోండి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మండల కేంద్రంలో కొనసాగుతున్న పెద్దశంకరంపేటకు చెందిన మహాత్మా జ్యోతి బాపూలే బీసీ గురుకులంలో అంటువ్యాధులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, గురుకులాలు అవినీతికి నిలయాలుగా మారాయని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. గురుకులాల్లో వ్యాప్తి చెందుతున్న వ్యాధులపై కలెక్టర్, సబ్‌కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ గురుకులంలో భోజనం సక్రమంగా ఉండడంలేదని కాంగ్రెస్ కార్యకర్తలే చెబుతున్నారన్నారు. టీఆర్‌ఎస్‌వీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రేయారెడ్డి, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, మాజీ సర్పంచ్ భారతి, సురేష్, నాయకులు విఠల్, సర్దార్ నాయక్, చింటు, సురేష్ ఉన్నారు.

ఉదయం పనులు.. రాత్రి దొంగతనాలు

- షెటర్ తాళాలు పగులగొడుతున్న నిందితుల అరెస్ట్
- నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీఐ ఉపేందర్



కేసు వివరాలను తెలుపుతున్న సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: ఉదయం ఫంక్షన్‌హాల్లో పనులు చేసుకుంటూ రాత్రి సమయాల్లో షెటర్ తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలోని వైష్ణవి మెడికల్ షాప్, వన్‌టౌన్ పీఎస్ పరిధిలోని హరిహర మెడికల్ షాప్‌లో ఈ నెల 11న రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న రాజమండ్రికి చెందిన ఇందుకూరి సూర్య (38), సిద్దిపేట జిల్లా తొగుట మండలం గుడికందులకు చెందిన బాణపురం సుభాష్ (40), మెదక్ జిల్లా పటాన్‌చెర్‌కు చెందిన ఎస్‌కె సాజిద్ (32), హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన మహ్మద్ ఆరీఫ్ (21)లు ఫంక్షన్‌హాల్ పనులు చేస్తుండగా పరిచయమయ్యారు. వీరంతా ఓ ముఠాగా ఏర్పడి ఉదయం ఫంక్షన్‌హాళ్లలో పనులు చేస్తూ రాత్రి సమయాల్లో తాళం వేసిన దుకాణాల షెటర్లు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా వారిని అరెస్టు చేశారు. అనంతరం నిందితుల నుంచి ఫోన్, ఆటోను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐ అసిఫ్, ఐడీ పార్టీ కానిస్టేబుల్ కనకరాజు, ప్రశాంత్ రెడ్డి, సిబ్బంది సందీప్‌రెడ్డిని సీఐ అభినందించారు.